కడ్తాల్, అక్టోబరు 6: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయ భవనం ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. నేడు(సోమవారం) భవన ప్రారంభానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. సొంత భవనం లేక ఏళ్లకాలంగా రెవెన్యూ అధికారులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులు నేటితో తొలగనున్నాయి. ఎట్టకేలకు భవనాన్ని ప్రారంభిస్తుండడంతో మండలప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ప్రభుత్వం 2022లో భవనానికి స్థలం కేటాయించి నిర్మాణానికి రూ.1.18 కోట్లు మంజూరు చేసింది. ఏడాది క్రితం 90శాతం పనులు పూర్తి చేశారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవతో రూ.20 లక్షలు మంజూరు చేయించారు. తహసీల్దార్ ముంతాజ్ చొరవతో రెండు నెలల్లో పనులు పూర్తి చేయించారు. కడ్తాల మండల కేంద్రంలో నేడు(సోమవారం) మంత్రి శ్రీనివాస్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఏర్పాట్లను ఆదివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరిశీలించారు. పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, కాంగ్రెస్ జిల్లా నాయకులు గూడూరు భాస్కర్‌రెడ్డి, జహంగీర్‌అలీ, తహసీల్దార్ ముంతాజ్‌లతో కలిసి ప్రారంభానికి సిద్ధం చేసిన భవనాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మంత్రి మధ్యాహ్నం 3 గంటలకు కడ్తాల మండల కేంద్రానికి చేరుకుంటారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా 80మందికి కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ, గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లను మంత్రి పంపిణీ చేస్తారని ఎమ్మెల్యే వివరించారు. మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొని మంత్రి కార్యక్రమాలను విజయవంతం చేయాలని నారాయణరెడ్డి కోరారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

విద్య, ఉపాధి, రాజ్యాధికారం

(5వ పేజీ తరువాయి)

ఇదే ముదిరాజుల నినాదం కావాలి

హామీని నిలబెట్టుకోవాలని ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. సంస్థాగత ఎన్నికల్లో ముదిరాజులదే పైచేయి కావాలన్నారు. ముదిరాజ్‌లు రాజ్యాధికారం సాధించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఐక్యతా లేని కారణంగానే అధికారం ఇతరులకు కట్టబెట్టి తమకు దక్కాల్సిన అన్ని రకాల హక్కులను కోల్పోతున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న కాసాని వీరేశ్ ముదిరాజ్

ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకోవాలి

ముదిరాజ్‌లు కలిసి ఉన్నా... ఒక్కటిగా లేరని.. ఐక్యత లేదంటూ చాలామంది విమర్శిస్తుంటే బాధగా ఉంటోందని వీరేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. కింది స్థాయి నుంచి నాయకులుగా ఎదిగేందుకు ఒకరికొకరు సహకరించుకోవాలన్నారు. ముదిరాజ్ జాతి ఎదగడానికి, మన హక్కులు సాధించుకోవడానికి చదువుకున్న యువత, పెద్దల సహకారం తీసుకోవాలని ఆయన సూచించారు. పార్టీలు ఏవైనా ఎజెండా ఒక్కటిగా ఉండాలన్నారు.ముదిరాజ్‌లకు పూర్తి న్యాయం చేస్తామని ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలన్నారు. అలాగే జీఓ ఎంఎస్. 15ను అమలు చేయాలన్నారు. నియోజక వర్గాల్లో ముదిరాజ్ భవన నిర్మాణాలకు ఇన్‌చార్జిలు కృషి చేయాలన్నారు. అనంతరం సంఘానికి సేవలందించిన పలువురు ముదిరాజ్ సంఘం పెద్దలను, నాయకులను సన్మానించారు. కాగా, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాసాని వీరేశ్‌ను జిల్లా నాయకులు సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గొట్టిముక్కుల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ ముఖ్య నాయకులు ఖల్కోడ నర్సింలు, దోమ రాంచంద్రయ్య, మాణిక్యం, నాగేశ్వర్, గోపాల్, సావిత్రి పండరినాథ్, వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ నియోజక వర్గాల ముఖ్య నాయకులు, యువ నాయకులు పాల్గొన్నారు.



కరుణాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న సభ్యులు

జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్‌గా కరుణాకర్‌రెడ్డి

రెండోసారి ఎన్నికైన తుమ్మలూరు మాజీ సర్పంచ్

మహేశ్వరం, అక్టోబరు 6 : రంగారెడ్డి జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్‌గా మండలంలోని తుమ్మలూరు మాజీ సర్పంచ్ మద్ది కరుణాకర్‌రెడ్డి రెండోసారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాల్లో క్రీడాకారులకు అండగా ఉంటానని తెలిపారు. గ్రామీణ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేస్తానన్నారు. రంగారెడ్డి డిస్ట్రిక్ట్ కబడ్డీ అసోసియేషన్ సమావేశం ఆదివారం నగరంలోని సరూర్‌నగర్ జ్యోతి క్లబ్‌లో జరిగింది. ఈ సందర్భంగా కరుణాకర్‌రెడ్డిని అసోసియేషన్ సభ్యులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జగదీశ్వర్‌యాదవ్, రవికుమార్, సుధాకర్‌రెడ్డి, రాజు, వెంకటేష్, చంద్రమోహన్, లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అందుగుల వాసికి డాక్టరేట్



సీత రాజు

ఆమనగల్లు, అక్టోబరు 6: మాడ్గుల మండలం అందుగుల గ్రామానికి చెందిన సీత రాజు ఉస్మానియా వర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. గణిత విభాగంలో 'థర్మో కన్వెక్టివ్ ఇన్‌స్టెబిలిటీస్ ఇన్ ఏ పోరస్, మీడియా విత్ కపుల్ స్ట్రెస్ ఫ్లూయిడ్' అంశంపై పరిశోధన చేశారు. ప్రొ.ధనలక్ష్మి గైడ్‌గా వ్యవహరించారని చెప్పారు. రాజును గ్రామస్థులు, స్నేహితులు అభినందించారు.

గోవా రైలుకు పచ్చజెండా

సికింద్రాబాద్ నుంచి ప్రారంభించిన.. కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్/హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా రైలు సర్వీసు అందుబాటులోకి రావడం తెలుగు రాష్ట్రాల పర్యాటకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి వాస్కో డ గామా బై వీక్లీ రైలును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఇప్పటి వరకు సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా రైలు సర్వీసు లేదన్నారు. గతంలో గోవాకు వెళ్లాలంటే పలు స్టేషన్లలో రైళ్లు మారాల్సి వచ్చేదని తెలిపారు. సికింద్రాబాద్ నుంచి నేరుగా గోవా వెళ్లే కొత్త రైలు కర్ణాటక వాసులకూ ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు వచ్చే ఏడాది పూర్తవుతాయని వెల్లడించారు. చర్లపల్లి స్టేషన్ పనులు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. హైదరాబాద్, కాచిగూడ స్టేషన్లనూ ఆధునీకరిస్తామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.



వాస్కో డ గామా రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

మెట్రో కారిడార్ 4, 9ను మార్చాలని బీజేపీ నేతల వినతి

హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు రెండో దశకు సంబంధించిన కారిడార్ 4, 9లో మార్పులు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములు యాదవ్, పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. తాము ప్రతిపాదించిన రూట్‌లో ఈ కారిడార్లు ఏర్పాటు చేస్తే 35 కి.మీ. మేర దూరం తగ్గుతుందని, తద్వారా ప్రాజక్టు ఖర్చు కూడా తగ్గుతుందని చెప్పారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. "మెట్రో అధికారులు విడుదల చేసిన రూట్‌మ్యాప్ ప్రకారం కారిడార్ 4 నాగోల్ నుండి శంషాబాద్ విమానాశ్రయం వరకు 36 కి.మీ. ఉంటుంది. కారిడార్ 9శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫోర్త్ సిటీ వరకు 40కి.మీ. ఉంటుంది. అంటే మొత్తం 76కి.మీ. మెట్రో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీని బదులు నాగోల్-ఎల్బీనగర్-మందమల్లమ్మ-బాలాపూర్ చౌరస్తా-శివాజీ చౌక్-ఆర్‌సీఐ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్-మహేశ్వరం గేట్-కందుకూరు ఫోర్త్ సిటీ వరకు మెట్రో లైను ఏర్పాటు చేస్తే 41 కి.మీ.తో పూర్తి చేయవచ్చు" అని శ్రీరాములు యాదవ్ వివరించారు. ఈ రూట్‌మ్యాప్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని.. ఆయన సూచన మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, మెట్రో ఎండీకి అందజేస్తామని శ్రీరాములు యాదవ్ పేర్కొన్నారు. కాగా, బంజారాల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీ సీతారాంనాయక్ డిమాండ్ చేశారు.

తెలంగాణ నుంచి మరిన్ని కథలు రావాలి

» ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్
» కథ-2023 సంకలనం ఆవిష్కరణ
» కథ కాల స్థితిగతులను రికార్డు చేస్తుంది: ప్రముఖ కవి శివారెడ్డి
» అమెరికా తరువాత తెలుగులోనే కథా సంకలనాల సిరీస్: వాసిరెడ్డి



కథ-2023 సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, చిత్రంలో ప్రముఖ కవి కే శివారెడ్డి తదితరులు

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 6: తెలంగాణ ప్రాంతం నుంచి మరింత విరివిగా కథా సాహిత్యం రావాల్సి ఉందని 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్ ఆకాంక్షించారు. వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ సంపాదకత్వంలో వెలువడిన కథ-2023 సంకలనాన్ని ఆయన ఆదివారం ఖమ్మంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ప్రముఖ కవి కె.శివారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కవి, విద్యావేత్త రవి మారుత్ అధ్యక్షతన జరిగిన సభలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం నుంచి మంచి కథకులు, కథలు వస్తున్నా ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఆ సంఖ్య కొంత తక్కువగానే ఉందన్నారు. సంకలనాల ప్రచురణకర్తలు ప్రాంతాల సమతుల్యాన్ని పాటిస్తే మంచిదన్నారు. సమాజంలో వస్తున్న అనేక మార్పులను కథకులు తమ వస్తువులుగా ఎంచుకుంటుండటంతో కథ భవిష్యత్ తరాలకు చరిత్ర అవుతుందన్నారు. కథా సంకలనాల్లో ప్రాంతీయ సమతుల్యం లేకపోతే ఈ ప్రాంతంలో మంచి కథకులు, కథలు లేవన్న అభిప్రాయం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. 1910ల్లోనే తెలంగాణ ప్రాంతం నుంచి కథలు వచ్చాయని, 1917 వరకు విస్తృతి పెరిగి వందల కథలు వచ్చాయన్నారు. కథా సంకలనం సిరీస్‌ను గత 34 ఏళ్లుగా నిరాటంకంగా నిర్వహిస్తుండటం సాధారణ విషయం కాదన్నారు. కథ కాల స్థితి గతులను రికార్డు చేస్తుందని కే శివారెడ్డి అన్నారు. ప్రపంచంలో ఏ మార్పులు సంభవిస్తున్నాయో కథకులు తమ కథల్లో రికార్డు చేస్తున్నారని చెప్పారు. వాసిరెడ్డి నవీన్ మాట్లాడుతూ 'షార్ట్ స్టోరీస్' పేరుతో అమెరికాలో 1915లో మొదలైన సిరీస్ ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. అమెరికా తరువాత తెలుగులోనే కథా సంకలనాల సిరీస్ వస్తోందన్నారు. పాపినేని శివశంకర్ మాట్లాడుతూ కథల ఎంపికలో తాము ప్రాంత, వర్గ, కుల భేదాలు చూడబోమన్నారు. ప్రముఖ సాహితీవేత్త ముప్పా శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. ఈ కథలను ప్రముఖ విశ్లేషకురాలు పీ జ్యోతి పరిచయం చేశారు.

పిడుగుపాటుకు ఇద్దరి మృతి

హనుమకొండ జిల్లాలోని ఓ పత్తి చేనులో దుర్ఘటన .. ఇంటర్ విద్యార్థిని, యువ రైతు మరణం



రాజుయాదవ్



శ్రావణి (ఫైల్)

ఐనవోలు/నెల్లికుదురు/హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం వర్షం కురువగా.. పిడుగుపాటు వల్ల హనుమకొండ జిల్లాలో ఓ ఇంటర్ విద్యార్థిని సహా ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, ఐదుగురు గాయపడ్డారు. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం వెంకటాపురానికి చెందిన కుకట్ల రాజుయాదవ్ (25) దౌతుబాజి శ్రావణి(17), కుకట్ల కోమల(రాజు యాదవ్ తల్లి) సహా ఏడుగురు కలిసి గ్రామ శివారులోని పత్తి చేనులో పత్తి ఏరుతున్నారు. అయితే, మధ్యాహ్నం మూడు గంటల సమయంలో భారీ వర్షం పడడంతో అందరూ సమీపంలోని ఓ రేకుల షెడ్డు కిందకి వెళ్లారు. పది నిమిషాల వ్యవధిలో ఆ షెడ్డుపై పిడుగుపడగా అంతా స్పృహ కోల్పోయారు. కాసేపటికి తేరుకున్న కొందరు ఇతరులను లేపేందుకు ప్రయత్నించగా రాజుయాదవ్, శ్రావణి ప్రాణాలు కోల్పోయారు. రాజుయాదవ్ తల్లి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. శ్రావణి జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఇంటర్ సెకండియర్ చదువుతుంది. యువ రైతు అయిన రాజు అవివాహితుడు. ఇక, మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నర్సింహులగూడెంలోని గ్రీన్ ఫీల్డ్ హైవే క్యాంపు కార్యాలయంలో ఇంజనీర్‌గా పని చేస్తున్న ఆర్.సింగారం సెల్‌ఫోన్ మాట్లాడుతుండగా పిడుగుపాటుకు గురై తీవ్రంగా గాయపడ్డాడు. సింగారం స్వస్థలం తమిళనాడులోని వెల్లూరు.. మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సింగారం పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది.

నేడు, రేపు వర్షాలు..

రాష్ట్రంలో సోమ, మంగళవారాల్లో అక్కడక్కడా మోస్తారు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్, మెదక్, కామారెడ్డి, సిద్దిపేట, జనగాం, హనుమకొండ, ఖమ్మం, ములుగు, భూపాలపల్లి, జనగాం, వరంగల్, యాదాద్రి జిల్లాలకు సోమవారం ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. కాగా, ఆదివారం జనగామలో 3 సెంటీమీటర్ల వర్షపాతం కురవగా, భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెంలో అత్యధికంగా 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

దుర్గా మాతకు ఘన పూజలు


షాద్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని దుర్గామాతను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


కందుకూరు: పులిమామిడిలో దుర్గామాత మండపం వద్ద చండీహోమంలో పాల్గొన్న సంధ్య-దామోదర్‌గౌడ్ దంపతులు

షాద్‌నగర్ అర్బన్/కందుకూరు/యాచారం/కడ్తాల/ఆమనగల్లు/మహేశ్వరం/కొత్తూర్/చేవెళ్ల, అక్టోబరు 6: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయాలు, మండపాల్లో నెలకొల్పిన దుర్గామాతలకు భక్తులు ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. రోజుకో అలంకారంలో అమ్మవారిని సేవిస్తున్నారు. నేతలు, అధికారులు అమ్మవారి పూజల్లో పాల్గొంటున్నారు. భక్తులపై దుర్గామాత ఆశీస్సులు ఉంటాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్‌లోని లక్ష్మీవేంకటేశ్వరాలయ ప్రాంగణంలో ఉన్న దేవీమాత ఆలయాన్ని ఆదివారం ఎమ్మెల్యే దర్శించుకున్నారు. నవరాత్రి ఉత్సవాలను భక్తిపారవశ్యంతో నిర్వహించుకుందామని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కిష్టయ్య, కౌన్సిలర్ టీ.ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తిరుపతిరెడ్డి, చెన్నయ్య, బస్వం, జి.సత్తయ్య, టీపీసీసీ తాలూకా అధ్యక్షుడు ఎం.వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట భవానీ మాత ఆలయంలో మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్ పూజలుచేశారు. ఆయనతో ఆలయ కమిటీ చైర్మన్ ఎం.రాజు, షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్, నాయకులు సాయిప్రసాద్‌యాదవ్, తాండ్ర వెంకట్‌రెడ్డి, టి.కృష్ణయ్య, సంజీవయ్య, జె.శంకర్, శ్రీను ఉన్నారు. కందుకూరు మండలం పులిమామిడిలో దుర్గా మం


ఆమనగల్లులోని మార్కండేయ ఆలయంలో సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు

డపం వద్ద మాజీ వైఎస్ ఎంపీపీ అనెగౌని సంధ్యాదామోదర్‌గౌడ్, నాయకులు బి.జవెంకట్‌రెడ్డి, ఇ.రమేష్, జె.ప్రవీణ్, తిరుపతిరెడ్డి, వెంకటేష్, సుధాకర్, అశోక్, రాజుగౌడ్ దంపతులు చండీ హోమం నిర్వహించారు. యాచారం మండల గ్రామాల్లో దుర్గామాత మండపాల వద్ద భక్తులు ఉదయం, సాయంత్రం పూజలు చేస్తున్నారు. కుర్మిద్ద, మేడిపల్లి, మాల్‌లలో అమ్మవారి మండపాలు ఆకట్టుకుంటున్నాయి. కడ్తాల మండల మైసిగండి శివరామాలయంలో శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. భవానీదేవి అలంకారంలో అమ్మవారు పూజలందుకున్నారు. ఫౌండర్ ట్రస్టీ సిరోలి పంతూ, ఈవో స్నేహలత పర్యవేక్షణలో మురళీధర్‌శర్మ చండీహోమం నిర్వహించారు. తహసీల్దార్ ఆర్పీ.జ్యోతి, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మెంబర్ అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, నిర్వాహకుడు భాస్కర్, అర్చకులు అమూల్యపతి, భానుప్రకాశ్, నాగేందర్‌శర్మ, యాదగిరి, సంతోష్, సిబ్బంది, చంద్రయ్య, కృష్ణ, శ్రీనివాసు, కృష్ణయ్య, శ్రీనువాస్ పాల్గొన్నారు. ఆమనగల్లులోని వాసవీకన్యక పరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివా రం అమ్మవారు గాయత్రిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. పూజల్లో ఆలయ కమిటీ చైర్మన్ వి.రామ్మోహన్, ట్రెజరర్ బి.శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు బికుమాండ్ల నర్సింహ, నట్రాజ్ యాదయ్య, లక్ష్మీనారాయణ, కృష్ణయ్య, నాగరాజు, అర్చకులు సీనయ్య శర్మ, దినేశ్‌శర్మ పాల్గొన్నారు. అలాగే ఆమనగల్లు మార్కండేయ ఆలయంలో అమ్మవారిని లలితత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. మహిళలు కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఎంగళి బాలకృష్ణ, నాయకులు కృష్ణయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ దుర్గయ్య, యాదగిరి, శ్రీనివాస్, రవి, ఈశ్వరయ్య, ఆంజనేయులు, సత్యనారాయణ, వాసు, రమేశ్, మురళీధర్, ప్రసాద్, భాస్కర్, లింగం, తిరపతయ్య, అంజయ్య, శివకుమార్, శ్రీధర్, పూజారులు శివ, అక్షయ్‌కుమార్ పాల్గొన్నారు. మహేశ్వరంలోని రాజరాజేశ్వరాలయంలో అమ్మవారు అన్నపూర్ణ దేవిగా దర్శనం ఇచ్చారు. సుప్రభాత సేవ, ఫలహారాభిషేకం, మంత్రపుష్ప పూజలు, హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కుమార్, పోతర్ల సుదర్శన్‌యాదవ్, నవీన్, రాములు, చందు, నరేష్ పాల్గొన్నారు. కొత్తూరు మున్సిపాలిటీ, మండల పరిధి గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉన్నత పాఠశాల ఆవరణలో దుర్గాదేవి అసోసియేషన్, పాత మున్సిపాలిటీ ఎదురుగా జైభవానీ సేవా సమితుల ఆధ్వర్యంలో దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నారు. చేవెళ్లలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో దసరా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. వేంకటేశ్వరస్వామికి రోజూ ఉదయం, సాయంత్రం పూజలు నిర్వహిస్తున్నారు. స్వామిని వైభవంగా ఊరేగిస్తున్నారు. ఊరేగింపులో మహిళలు కోలాటాం ఆడుతు కనువిందు చేస్తున్నారు. కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తలు వామనాచార్యులు, పూజారులు, భక్తులు ఉన్నారు. అలాగే చేవెళ్ల రచ్చబండ దుర్గామాత విగ్రహానికి పూజలు కొనసాగుతున్నాయి. మండపం వద్ద రోజూ అన్నదానం నిర్వహిస్తున్నారు. అలాగే మల్కాపూర్, కందవాడ, పామెన, కమ్మెట, ఆలూర్, తంగడ్‌పల్లి గ్రామాల్లో దుర్గామాతకు పూజలు చేస్తున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, పార్టీల ప్రజాప్రతినిధులు, మహిళలు, భక్తులు ఉన్నారు.


కొత్తూరు దుర్గాదేవి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు


యాచారం మండలం మేడిపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు


బ్రహ్మోత్సవాల సందర్భంగా చేవెళ్లలో స్వామివారిని రథంపై ఊరేగిస్తున్న భక్తులు


కడ్తాల్ : మైసిగండిలో భవానీదేవి అమ్మవారికి పూజలు


చేవెళ్ల: మల్కాపూర్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

తొండుపల్లిలో ఫుటోవర్ బ్రిడ్జి నిర్మించాలి


ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్ లావణ్యశ్రీనివాస్‌గౌడ్

శంషాబాద్ రూరల్, అక్టోబరు 6: శంషాబాద్ పట్టణ పరిధి తొండుపల్లిలో హైదరాబాద్-బెంగళూరు హైవేపై ప్రమాదాల నివారణకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కౌన్సిలర్ పారెపల్లి లావణ్యశ్రీనివాస్‌గౌడ్, కిషన్‌గూడ, తొండుపల్లి నాయకులు ఆదివారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు వినతిపత్రం ఇచ్చారు. నిత్యం విద్యార్థులు, గ్రామస్తులు హైవేపై ప్రమాదకర పరిస్థితుల్లో రోడ్డు దాటుతున్నారని, ముందే నేషనల్ హైవే కావడంతో వాహనాలు వేగంగా వెళ్తాయని, అలాంటి సమయాల్లో విద్యార్థులు, స్థానికులు రోడ్డు క్రాస్ చేస్తున్న సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే ఈ ప్రదేశాల్లో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో ఎంతోమంది మృతిచెందారని ఎమ్మెల్యేకు వివరించారు. స్పందనగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు తీర్చడమే తన లక్ష్యం అని, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన త్వరలోనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, వైస్‌చైర్మన్ గోపాల్‌యాదవ్, నార్సింగ్ ఏఎంసీ మాజీ చైర్మన్ డి.వెంకటేష్‌గౌడ్, కౌన్సిలర్ సంజయ్‌యాదవ్, ప్రవీణ్‌గౌడ్, పెంటయ్య, కె.దర్శన్‌గౌడ్, భీమ్‌రాజు, నాగారాజు పాల్గొన్నారు.

ఈద్గాకు నూతనంగా రోడ్డు వేయాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న మాజీ సర్పంచ్ ఇస్తారి, యువకులు

శంషాబాద్ రూరల్, అక్టోబరు 6: సుల్తాన్‌పల్లిలో ఈద్గా రోడ్డు సమస్యను పరిష్కరించాలని ముస్లింలు మాజీ సర్పంచ్ దండు ఇస్తారి అధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు వినతిపత్రం ఇచ్చారు. అలాగే గ్రామంలో సీసీ రోడ్డు పనులకు నిధులు కేటాయించాలని కోరారు. త్వరలోనే ఈద్గా వరకు రోడ్డు వేయిస్తానని, సీసీ రోడ్లకు నిధులిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మండలంలో ఏ ఊరికీ ఇవ్వని నిధులు సుల్తాన్‌పల్లికి ఇచ్చానని ఎమ్మెల్యే వారితో అన్నారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, ప్రభాకర్‌గౌడ్, మల్లికార్జున్‌యాదవ్, సిద్దిఖీ, ఎం.రాజు, పాండురంగారెడ్డి, శివగౌడ్, భీష్మగౌడ్, అఫ్రోజ్, షబ్బీర్, ఇక్బాల్, బషీర్, ఖదీ ర్, ఫిరోజ్, ఇమ్రాన్, సయ్యద్ తాజుద్దీన్, షాన్ పాల్గొన్నారు.

నల్లచెర్వు పంచాయతీకి నిధులివ్వాలి


ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

మాడ్గుల, అక్టోబరు 6: మండలంలోని నల్లచెర్వు పంచాయతీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని గ్రామ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఆదివారం వారు ఎమ్మెల్యేను క్యాంప్ కార్యాలయంలో కలసి గ్రామంలో నెలకొన్న సమస్యలపై వివరించారు. ఆయన సానుకూలంగా స్పందించి గ్రామ సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డి వెంకట్‌రెడ్డి, కట్ట జగన్, మల్లయ్య, కరుణాకర్, శంకర్, జంగయ్య పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

గోవా రైలుకు బీజేపీ నాయకుల స్వాగతం


షాద్‌నగర్ స్టేషన్‌లో గోవా వెళ్తున్న రైలు వద్ద బీజేపీ నాయకులు

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 6 : సికింద్రాబాద్ నుంచి గోవా వెళ్తూ షాద్‌నగర్‌లో ఆగిన రైలుకు స్థానిక బీజేపీ నాయకులు ఆదివారం స్వాగతం పలికారు. దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ నుంచి షాద్‌నగర్ మీదుగా గోవాకు రైలును ప్రారంభించింది. షాద్‌నగర్‌లో ఆగిన రైలుకు బీజేపీ నాయకులు స్వాగతం పలికి, స్వీట్లు తినిపించుకున్నారు. ప్రధాని నరేంద్రమోదీ కృషితో ఈ ప్రాంత పేదలు తక్కువ ఖర్చుతో గోవా వెళ్లొచ్చే అవకాశం కలిగిందని నాయకులు అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, కె.మనోహర్‌రెడ్డి, వెంకటేష్, మఠం రుషీకేష్, వంశీకృష్ణ, నర్సింహయాదవ్, ఎంకన్నోళ్ల వెంకటేష్, ఐ.శ్రీనివాస్, మోహన్‌సింగ్, కాసోజు శివ, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఎదురులేని శక్తిగా తయారు చేయాలి


రావిరాలలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న అందెల శ్రీరాములుయాదవ్

మహేశ్వరం, అక్టోబరు 6: మహేశ్వరం నియోజకవర్గంలో బీజేపీని తిరుగులేని శక్తిగా తయారు చేయాలని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. ఆదివారం తుక్కుగూడ మున్సిపల్ పరిధి రావిరాలలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్నికలు ఏవైనా సరే విజయం బీజేపీదే కావాలన్నారు. అంతలా పార్టీని పటిష్ఠం చేద్దామన్నారు. కార్యక్రమంలో తుక్కుగూడ మున్సిల్ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, కృష్ణాగౌడ్, లింగం, రాజ్‌కుమార్, యాదగిరి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొత్తూర్: కేంద్ర ప్రభుత్వ పథకాలు నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య పిలుపునిచ్చారు. మండల పరిధి శేరిగూడభద్రాయపల్లిలో ఆదివారం నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి బాబయ్య ముఖ్య అతిథిగా హాజరై సభ్యత్వాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. బీజేపీ సభ్యత్వాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రమేష్, నాయకులు మల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, గణేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.


ఎస్‌బీపల్లిలో పార్టీ సభ్యత్వాలు అందజేస్తున్న నాయకుడు అందె బాబయ్య

ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలి


సంగెంలో మైసమ్మ తల్లి విగ్రహావిష్కరణలో పాల్గొన్న మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్‌రెడ్డి, స్థానిక నాయకులు

కేశంపేట, అక్టోబరు 6: ప్రజలందురూ భక్తిభావాన్ని అలవర్చుకొని, క్రమశిక్షణతో మెలగాలని మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్‌రెడ్డి అన్నారు. సంగెంలోని వేముల్‌నర్వ రోడ్డులో ఆదివారం మైసమ్మ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విశాలశ్రవణ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. మన సంస్కృతిలో గ్రామ దేవతలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. కేశంపేట చర్ల మైసమ్మ, మైసిగండి మైసమ్మ వలనే ఈ మైసమ్మ కూడా ప్రసిద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కృష్ణయాదవ్, వీరారెడ్డి, ఇబ్రహీం, రఘుపతిరెడ్డి, చౌదరయ్యగౌడ్, వెంకటయ్య, కుమార్‌గౌడ్, కిష్టయ్య, రామచెంద్రి పాల్గొన్నారు.

సీఎం సహకారంతో కడ్తాలకు మహర్దశ


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, అక్టోబరు 6: సీఎం రేవంత్‌రెడ్డి సహకారం, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కృషి ఫలితంగా కడ్తాల మండలానికి మహర్దశ వచ్చిందని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ అన్నారు. ఫోర్త్‌సిటీ ఏర్పాటైతే కడ్తాల ప్రాంతం వేగవంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. కడ్తాలను పారిశ్రామికంగా అభివృద్ధి చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. దక్షిణ తెలంగాణ అభివృద్ధికి సీఎం చేపడుతున్న చర్యలను కేటీఆర్, హరీశ్‌రావులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధానకార్యదర్శి బిక్యానాయక్, నాయకులు భాస్కర్‌రెడ్డి, బిచ్యా, జహంగీర్‌బాబ, జహంగీర్ అలీ, చందోజీ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

కాటి కాపరుల సంక్షేమానికి పెద్దపీట వేయాలి


నూతన కార్యవర్గంతో గాదె సత్తయ్య

కందుకూరు, అక్టోబరు 6: కాటికాపరుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేయాలని కాటికాపరులు, శ్మశానవాటికల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గాదె సత్తయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గాదె కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం కందుకూరులో సంఘం మండల సమావేశంలో మాట్లాడారు. కాటికాపరులకు ఈఎస్ఐపీఎఫ్ వర్తింపజేయాలని, ఆరోగ్యశ్రీ కార్డులివ్వాలి, రూ.25లక్షల బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. దహన సంస్కారాలకు రూ.25వేలివ్వాలన్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా టి.నర్సింహ, ఉపాధ్యక్షుడిగా వి.మహేష్, ప్రధాన కార్యదర్శిగా గాదె చెన్నయ్య, కోశాధికారులుగా గాదె శేఖర్, వి.ప్రశాంత్, గౌరవాధ్యక్షులుగా గాదె లక్ష్మయ్య, పి.రాములు, కార్యదర్శులుగా పి.కరుణాకర్, గాదె సుధాకర్, జి.చెన్నయ్య, జి.దానయ్య, టి.వీరయ్య ఎన్నికయ్యారు.

చౌకధరల దుకాణం ప్రారంభం

కొత్తూర్, అక్టోబరు 6: స్టేషన్ తిమ్మాపూర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన చౌకధరల దుకాణాన్ని మాజీ ఎంపీపీ వేణుగోపాల్‌గౌడ్ ఆదివారం ప్రారంభించారు. తిమ్మాపూర్‌లోని రేషన్ షాపు స్టేషన్ వాసులకు దూరంగా ఉండడంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు తెలిపారు. ఆయన స్టేషన్ తిమ్మాపూర్‌లో సబ్‌రేషన్ షాపును ఏర్పాటు చేయించారు. ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు జె.వేణుగోపాల్‌గౌడ్, జనార్దన్‌రెడ్డి, వసుపుల మహేందర్, శ్రీను, డీలర్ యాదయ్య పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలి


తంగెళ్లపల్లిలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

చౌదరిగూడ, అక్టోబరు 6: ఆటల్లో క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకొని క్రీడాస్ఫూర్తితో నడుచుకోవాలని కొందుర్గు మాజీ వైస్‌ఎంపీపీ రాజేష్‌పటేల్ అన్నారు. ఆదివారం తంగెళ్లపల్లిలో టీపీఎల్-8 సీజన్ పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులతో మాట్లాడుతూ క్రీడలతో శారీరక దృఢత్వం కలుగుతుందని, క్రీడాకారుల నైపుణ్యం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బాల్‌రాజ్, రామకృష్ణ, రవీందర్‌రెడ్డి, నర్సింహులుగౌడ్ పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ పథ్ సంచాలక్ యాత్ర

శంషాబాద్, అక్టోబరు 6 : శంషాబాద్‌లో ఆర్ఎస్ఎస్ పథ్ సంచాలక్ యాత్రను ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఆర్ఎస్ఎస్‌ను స్థాపించి 99సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శంషాబాద్‌లో ఈ పథ్ సంచాలక్ యాత్ర నిర్వహించారు. శంషాబాద్‌లోని హైస్కూల్ గ్రౌండ్ నుంచి భారత్ చౌరస్తా, బస్‌స్టేషన్ మీదుగా ఆర్బీనగర్ మైదానం వరకు యాత్ర నిర్వహించారు. భారీగా కార్యకర్తలు పాల్గొన్నారు.


శంషాబాద్‌లో ఆర్ఎస్ఎస్ పథ్ సంచాలక్ యాత్ర నిర్వహిస్తున్న స్వయం సేవకులు

ఘనంగా కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం


కేవీపీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న ప్రకాశ్ కారత్

తలకొండపల్లి, అక్టోబరు 6: కేవీపీఎస్ అవిర్భావ దినోత్సవాలను ఆదివారం లింగరావుపల్లిలో నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాశ్ కారత్ హాజరయ్యారు. నాయకులతో కలిసి జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దళితుల హక్కుల పరిరక్షణకు కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి పోరాటాలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో సమితి జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నయ్య, నాయకులు ఎల్లమ్మతిరుపతయ్య, యాదయ్య, అంజయ్య, యాదయ్య, మల్లయ్య, జంగయ్య పాల్గొన్నాను.

సంక్షిప్తంగా...

● **ఆమనగల్లు:** ఆమనగల్లు లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని క్లబ్ రీజియన్ చైర్ పర్సన్ తెప్ప శ్రీను అన్నారు. కల్వకుర్తి లయన్స్ భవన్‌లో ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. జోన్ చైర్మన్ పర్సన్ సంపత్ జనార్ధన్‌రెడ్డి, అధ్యక్షుడు లక్ష్మారెడ్డిలతో కలిసి సమావేశాన్ని శ్రీను ప్రారంభించారు. కార్యాచరణ ప్రణాళికకు రూపొందించారు. గ్రామాల్లో లయన్స్ క్లబ్ హెల్త్ క్యాంప్‌లు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని లక్ష్మారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ మహేశ్, కోశాధికారి నర్సింహ, జిల్లా చైర్మన్ రమేశ్, కో-ఆర్డినేటర్ కసిరెడ్డి రాంరెడ్డి, రామచంద్రారెడ్డి, సభ్యులు వెంకట్ రెడ్డి, సురేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, పీఆర్వో పాషా ఉన్నారు.

● **చేవెళ్ల:** చేవెళ్ల పంచాయతీ పారిశుధ్య కార్మికుడు కందాడ సాయన్న-సుజాత దంపతుల కుమార్తె హిందు నీట్‌లో ఉత్తమ ర్యాంక్‌తో వరంగల్‌లోని కాళోజీ మెడికల్ కాలేజీలో ఫ్రీ సీటు సాధించింది. ఆమె చదువుకు మాజీ ఎంపీపీ విజయలక్ష్మి-రమణారెడ్డిల కుమారుడు.. బీజేపీ యువ నాయకుడు మల్గారి వైభవ్‌రెడ్డి రూ.లక్ష సాయం అందజేశారు. అలాగే మండల అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో దళితరత్న అవార్డు గ్రహీత బురాన్ ప్రభాకర్ బాలిక హిందును సన్మానించి అంబేడ్కర్ ఫొటోను అందించారు. తన వంతుగా రూ.10వేలు అందించారు. ఏఎంసీ వైస్‌చైర్మన్ రాములు, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు ప్రవీణ్, జర్నలిస్టులు గోపాల్, రాకేశ్, మధు, యాదయ్య, జంగయ్య, శ్రీనివాస్, సత్యనారాయణ, యాదయ్య ఉన్నారు.

● **కడ్తాల్:** మైసిగండికి చెందిన కిషన్‌నాయక్ ఇటీవల మృతి చెందాడు. అతడి కుటుంబాన్ని నాయకులు పరామర్శించారు. కెతావత్ స్టాలిన్ రూ.3వేలు అందజేశారు. పరామర్శించిన వారిలో తులసీరామ్‌నాయక్, రాము, బోని శంకర్, అర్జున్, బిక్కునాయక్, యాదగిరి, జగన్, రమేశ్, శ్రీను, నరేశ్ ఉన్నారు.

● **షాద్‌నగర్:** షాద్‌నగర్-జానంపేట జంట పట్టణాల్లో దసరా వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని వీహెచ్‌పీ, భజ్రంగ్ దళ్, ఆర్ఎస్ఎస్, సంఘ్ హిందూ వాహిని నాయకులన్నారు. షాద్‌నగర్ పతంజలి యోగా సెంటర్‌లో సమావేశమయ్యారు.

● గుంతలు పూడ్చండి


యాచారంలోని నందివనపర్తి రోడ్డుపై గుంతలతో వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. వెంటనే మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. - యాచారం

క్రైం కార్నర్

ఆటోను ఢీకొట్టిన లారీ.. వ్యక్తి దుర్మరణం


భాస్కర్ మృతదేహం

యాచారం, అక్టోబరు 6: లారీ ఆటోను ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన శనివారం రాత్రి మండలంలో మాల్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చింతపల్లి మండలం మాల్ వీటీనగర్‌కు చెందిన భాస్కర్(35), తన ఇద్దరు అక్కలు వెంకటమ్మ, జయమ్మలతో కలిసి నాంపల్లిలో శనివారం పొద్దంతా కూరగాయలు అమ్మారు. రాత్రిపూట అక్కడ ఆటో మాట్లాడుకొని స్వగ్రామం బయల్దేరారు. ఆటోలో మర్రిగూడ వైపు నుంచి మాల్‌కు వస్తున్నారు. కాగా మాల్ సమీపంలో రాత్రి పదిన్నర సమయంలో మాల్ వైపు నుంచి మర్రిగూడ వైపు వెళ్తున్న లారీ వీరి ఆటోను ఢీకొట్టింది. దాంతో భాస్కర్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటమ్మ, జయమ్మ, ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. భాస్కర్ మృతదేహానికి పోస్టుమార్టం చేయించి అప్పగించామని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్‌కుమార్ తెలిపారు.

ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

యాచారం, అక్టోబరు 6 : అక్రమంగా తరలిస్తున్న ఆరుక్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. పల్లెచెలక తండాకు చెందిన కృష్ణ తన ఆటోలో చౌదర్‌పల్లిలో ప్రజల నుంచి కిలో రూ.12 చొప్పున కొని స్వగ్రామానికి తరలిస్తున్నాడు. ఆటోను పెట్రోమొబైల్ పోలీసులు పట్టుకుని ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు యాచారం పోలీసులు చెప్పారు.